క్లుప్తంగా

అంగన్‌వాడీల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

విజయనగరం ఫోర్ట్: బరువు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా వీటీ అగ్రహారంలో అంగన్‌వాడీలు మంగళవారం నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సత్యవతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీకి అవకాశం కల్పించాలి



విలేకర్లతో మాట్లాడుతున్న డైట్ విద్యార్థులు

నెల్లిమర్ల: డీఎస్సీ-2025లో తమకు అవకాశం కల్పించాలని 2023 - 25 డైట్ విద్యార్థులు కోరారు. మంగళవారం స్థానిక వేణుగోపాల పురంలోని డైట్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 2023 - 25 డీఈడీ విద్యా సంవత్సరం ఈ నెలతో పూర్తి కానుందని, మూడు సెమిస్టర్లు పరీక్షలు కూడా పూర్తయ్యాయని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో అవకాశం కల్పించాలని కోరారు. అలాగే 4వ సెమిస్టర్ పరీక్ష మే నెల మొదటి వారంలో రాస్తున్నామని, మెగా డీఎస్సీ, టెట్ పరీక్షలకు రాయటానికి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డైట్ విద్యార్థులు వి.ప్రతీక్ష, టి.త్రివేణి, ఎం.అనిత, వి.మహేష్, షరీఫ్, వాహిని, జి.దివ్య, పి.హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పోటీల్లో సంతు ప్రతిభ



విజేతగా నిలిచిన సంతు

పూసపాటిరేగ: రాష్ట్ర స్థాయి దివ్యాంగ విద్యార్థుల క్రీడా పోటీలలో పూసపాటిరేగ విద్యార్థి ప్రతిభ చూపించాడు. మండల కేంద్రానికి చెందిన కందివలస సంతు బంగారు, వెండి పతకాలు సాధించాడు. ఈ నెల 21 నుంచి ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రజ్ఞ వైకల్యం, ఆటిజం, డౌన్‌సిండ్రోమ్, మస్తిష్క పక్షవాతం వైకల్యాలు గల పిల్లలకు జరుగుతున్న పోటీలలో పూసపాటిరేగకు చెందిన కందివలస సంతు 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు పందెంలో విజేతగా నిలిచాడు. కోచ్‌గా బంగారునాయుడు వ్యవహరించారు. విద్యార్థిని ఎంఈఓ పాపినాయుడు, డీఈఓ మాణిక్యాలునాయుడు అభినందించారు.

అగ్నిప్రమాద బాధితులకు వితరణ



బాధితులకు నగదు అందజేస్తున్న హెచ్‌ఎం అరుణకుమారి తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని గులివిందలపేట అగ్నిప్రమాద బాధితులకు పతివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తమ వంతు సాయంగా రూ.10 వేలు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చింతపల్లి అరుణకుమారితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పైడిమాంబ కళానికేతన్ వార్షికోత్సవం



అలరించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

విజయనగరం టౌన్: స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియంలో శ్రీ పైడిమాంబ కళానికేతన్ ఆధ్యాత్మిక సేవా సంఘం 27వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. కళాపీఠం వ్యవస్థాపకులు ఆర్.సూర్యపాత్రో ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బాలాజీ కోలాట ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. శ్రీ వైష్ణవి కళాక్షేత్రం చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన, శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు ఎమ్.భీష్మారావు సారథ్యంలో శిష్య బృందం ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకున్నాయి. డాక్టర్ భేరి రాధికా రాణి సారథ్యంలో నర్తనశాల చిన్నారులు అద్భుతమైన నృత్య ప్రదర్శన చేశారు. డప్పు శ్రీను జానపద గీతాలు అలరించాయి. అనంతరం నిర్వహించిన సభా కార్యక్రమంలో అమ్మవారి చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో అతిథులు పిళ్లా విజయకుమార్, ధవళ సర్వేశ్వరరావు, కర్రి సత్యనారాయణ, చందు, డాక్టర్ పి.స్వప్న హైందవి, మానాప్రగడ సాహితీ, గెద్ద వరప్రసాద్ తదితరులు ప్రసంగించారు. అధిక సంఖ్యలో అభిమానులు, సభ్యులు పాల్గొన్నారు.

చల్లని హాని

- వేసవిలో శీతల పానీయాలతో జాగ్రత్త



నగరంలోని జ్యూస్ షాప్

విజయనగరం: మండే ఎండల నుంచి తాత్కాలిక ఉపశమనం పొందేందుకు చల్లటి పానీయాలపై ఆసక్తి చూపడం సహజమే. ఈ తరుణంలో ఎక్కువ శాతం పండ్ల రసాలపై మక్కువ చూపుతారు. వేసవి నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. విజయనగరం జిల్లా కేంద్రంలో ఎండా కాలంలో వందల సంఖ్యలో పండ్లు, చెరకు, నిమ్మ రసాలు, మజ్జిగ తదితర బండ్ల దుకాణాలు అందుబాటులోకి వచ్చాయి. శుచి, శుభ్రత పాటిస్తున్నారా.. నాణ్యమైన పదార్థాలను వాడుతున్నారా... అనే సందేహాలు కొన్ని స్టాళ్లను చూస్తే వ్యక్తమవుతున్నాయి. ఆహార భద్రతా విభాగం అధికారులు తనిఖీలు చేయాల్సిన అవసరం ఉంది.

కృత్రిమ రుచులు

కొన్ని చోట్ల కృత్రిమంగా తయారు చేసిన రుచులు (ఫ్లేవర్స్) వినియోగిస్తున్నారు. ఇలాయిచీ, బాదాం, పిస్తా రుచులు, రంగుల పొడులు కలుపుతారు. ఆకర్షణ కోసం వివిధ రంగుల మిశ్రమాన్ని రసాల్లో కలిపితే అనారోగ్యకరమని నిషేధించారు.

ఐస్ గడ్డలు

మంచి నీటితో తయారయ్యే ఐస్ గడ్డలు ఎక్కువ సమయం ఉండవు. మలినాలతో కూడిన వాటితో చేస్తే ఎక్కువ సమయం ఉంటాయి. రవాణాకు సౌకర్యంగా ఉంటాయి. ఊక వేసి గడ్డలు కరగకుండా చేస్తారు. హాని కారక, బ్యాక్టీరియా ఉండే నీళ్లతో చేసే మంచుగడ్డలను కలిపి రసాల తయారీని ఎంచుకోకపోవడం ఉత్తమం.

ఫంగస్

పండ్లు, ఇతర పదార్థాలు పుచ్చిపోయిన వాటిని వినియోగిస్తారు. కొన్ని చెరకు గెడలకు ఫంగస్ ఉంటుంది. యంత్రంలో మొత్తం క్రషింగ్ చేసి రసం తీస్తారు. అంగూర్ తాజాగా ఉండేందుకు ఉప్పు నీటిలో వేస్తారు. నిర్వాహకులు ఎలాంటి పండ్లు, పదార్థాలను వాడుతున్నారనేది వినియోగదారులు గమనించాలి.

దుమ్ముధూళి

పండ్లను, రసాలను తయారు చేసే పాత్రలు శుభ్రంగా ఉండాలి. రోడ్డు పక్కన, రద్దీ ప్రాంతాల్లో దుమ్ముధూళి రసాల్లోకి చేరుతాయి. స్టాల్ చుట్టూ ఎలాంటి కవర్ ఉండదు. రసాలు తీసే యంత్రాలను ఏరోజుకారోజు శుభ్రం చేయాల్సి ఉంటుంది.

దుష్పరిణామాలు

పండ్ల రసాల తయారీ దశలో కలుషితమైతే హెపటైటిస్-ఏ వైరస్ సంక్రమించి పచ్చ కామెర్లు వస్తాయి. ఈకొలి బ్యాక్టీరియాతో వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్ వచ్చే అవకాశం ఉంది. నులి పురుగుల సంక్రమణ జరగొచ్చు. గొంతు నొప్పి, ఇన్ ఫెక్షన్లు వస్తాయి. దంతాలు బలహీనపడతాయి. జీర్ణ వ్యవస్థకు ఉపకరించే న్యూట్రియింట్స్ లభించవు. క్రిమి సంహారక మందులతో పండిన పండ్లను సరైన విధానంలో శుభ్రం చేయకపోతే క్యాన్సర్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.

ఆరోగ్యం మీ చేతుల్లోనే..

వేసవి తీవ్రత కారణంగా శరీరంలోని లవణాలు కోల్పోవాల్సి వస్తుంది. అందులో ప్రధానంగా పొటాషియం రీప్లేస్ చేయడంలో తాజా పండ్లు కీలక పాత్రను పోషిస్తాయి. సహజ సిద్ధంగా లభించేవి తీసుకోవాలి. ఇంట్లోనే రసం తయారు చేసుకోవాలి. చక్కెర లాంటివి కలిపి తీసుకోవద్దు. అతి చల్లటి, అధిక వేడి పదార్థాలు తీసుకోవద్దు. ఎవరి ఆరోగ్యం వారి చేతుల్లోనే ఉంటుంది.

– శ్రీనివాస్, చిన్న పిల్లల వైద్యులు

విత్తనోత్పత్తి చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పరిశోధన సంచాలకులు సత్యనారాయణ

విజయనగరం ఫోర్ట్: రైతు ఉత్పత్తిదారుల సంఘాలు విత్తనోత్పత్తి చేసుకోవాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతున్న ఉత్తర కోస్తా జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పరిశోధన, సలహా మండలి సమావేశంలో ఆయన మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న కమతాలకు జపాన్, చైనా మోడల్స్ యంత్రీకరణ వాడాలన్నారు. చెరువు మట్టిని పొలాల్లో వాడాలన్నారు. వేసవి దుక్కులు బాగా చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ యం.గిరిజారాణి మాట్లాడుతూ సన్న రకాలు, మధ్యస్థ మినికోటి రకాలు, ఆర్‌జీఎల్ 7034, 7039 రకాలు రానున్న రోజుల్లో రాగోలు పరిశోధన స్థానం నుంచి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. పచ్చి రొట్ట ఎరువు వేసి మాత్రమే వరి వ్యవసాయం చేయాలన్నారు. అపరాలలో విత్తనాల నిల్వ కోసం హెర్మాటిక్ బ్యాగులు వాడాలన్నారు. సమావేశంలో రాష్ట్ర స్థాయి పప్పు జాతుల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.మోహన్‌రెడ్డి, నూనె గింజల ప్రధాన శాస్త్రవేత్త ఒ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో పదో తరగతి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్



విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న వీసీ ప్రొఫెసర్ మహంతి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ మంగళవారంతో ముగిసింది. విజయనగరం కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న బాలికలు గడిచిన 12 రోజులుగా వివిధ అంశాల్లో శిక్షణ పొందారు. శిక్షణ పొందిన విద్యార్థులకు విశ్వ విద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. ఉన్నత చదువులకు ఇంటర్న్‌షిప్ ఉపయోగపడుతుందన్నారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ సుజాతకుమారి మాట్లాడుతూ శిక్షణ వలన విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలు పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీన్ సన్నీ డయోల్, అసిస్టెంట్ ప్రొఫెసర్ జోగినాయుడు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



రామానాయుడుని సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

విజయనగరం టౌన్: ప్రస్తుతం ఉరుకులు పరుగులు జీవితాలకు ఆధ్యాత్మికతనేది చాలా ముఖ్యమైనదని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఆర్‌బి.రామానాయుడు పేర్కొన్నారు. స్థానిక కొత్త గవరవీధి రామమందిరం వద్ద మంగళవారం శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణపై రామానాయుడు అందించిన ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. అన్నప్రసాదం విశిష్టతను వివరించి ఆహూతుల మన్ననలు అందుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు మొల్లేటి నాయుడు, లావణ్యల ఆధ్వర్యంలో విజయనగరం వయోవృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగా డీఎస్సీ నోటిఫికేషన్



మాట్లాడుతున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

విజయనగరం గంటస్తంభం: రాష్ట్రంలో నిరుద్యోగులు ఐక్యంగా అనేక పోరాటలు చేయడం ద్వారానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల సాధ్యమైందని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను స్వాగతిస్తున్నట్లు డీవైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ హరీష్, ఉపాధ్యక్షుడు సతీష్ అన్నారు. నోటిఫికేషన్‌కు సంబంధించి భవిష్యత్తులో అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. రాష్ట్రంలో 30వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా కేవలం 16,347 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో స్పెషల్ డీఎస్సీ గురించి రాష్ట్ర ప్రభుత్వం ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. జిల్లాకు ఓకే పేపర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున అభ్యర్థులకు వయోపరిమితి సడలింపుపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. పీఈటీ పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. పోరాటాల సందర్భంగా డీవైఎఫ్‌ఐ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు.

గురజాడ, గిడుగు,ఆదిభట్లకు ఆదరణ కరువు

- ప్రముఖులను మరిచిన సర్కారు
- లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ



సమావేశంలో మాట్లాడుతున్న లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ

విజయనగరం గంటస్తంభం: రాష్ట్రంలోని ప్రముఖుల జయంతి, వర్ధంతులను అధికార కార్యక్రమాలుగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జాబితాలో గురజాడ, గిడుగు, ఆదిభట్ల లాంటి ప్రముఖుల పేర్లు లేకపోవడం తమకు బాధ కలిగించిందని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ..తన రచనలతో తెలుగు జాతికి సరికొత్త వెలుగుల మార్గం చూపిన గొప్ప రచయిత మహాకవి గురజాడ అప్పారావు. దళిత ఆదివాసీల సంక్షేమం కోసం అలుపెరుగని పోరాటం చేసి సవర జాతికి ప్రత్యేక లిపిని తయారు చేసిన మహానుభావుడు గిడుగు. దేశ చరిత్రలోనే హరికథకు ఒక రూపం ఇచ్చిన మహోన్నత వ్యక్తి ఆదిభట్ల నారాయణదాసు. అలాంటి వ్యక్తులు రాష్ట్ర ప్రభుత్వంలోని అధికారులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కనీసం గుర్తుకు రాకపోవడం ఆశ్చర్యమనిపించిందని, ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, లాంటి వారు గురజాడ అప్పారావు మాటలను నేటితరానికి తెలియచెప్పే ప్రయత్నం ఢిల్లీ నుంచి చేస్తుంటే రాష్ట్రంలో గురజాడ, ఆదిభట్ల, గిడుగుల పేర్లుతో జయంతులు లేకుండా లిస్టులు విడుదల చేసి సాంస్కృతిక, కళా అభిమానులను అవమానించారని భీశెట్టి బాబ్జీ మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వంలోని సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి, ఆ శాఖ అధికారులు దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అధికారికంగా ఆ ముగ్గురు పేర్లు ప్రకటించాలని, ఉత్తరాంధ్ర మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాసరావు, కింజరాపు అచ్చంనాయుడు, గుమ్మడి సంధ్యారాణి ప్రభుత్వంపై ఒత్తడి తేవాలని కోరారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ ప్రతినిధి బోర రమేష్, పౌర వేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్రరాజు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరి

విజయనగరం: అనుమతులు ఉన్న అన్ని వ్యాపార, వాణిజ్య సంస్థలు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉండాలని విజయనగరం కార్పొరేషన్ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి సూచించారు. నగరంలోని 37, 38 సచివాలయాల పరిధిలో ప్రజారోగ్య సిబ్బందితో పర్యటించి పారిశుధ్య పనితీరుతో పాటు ట్రేడ్ లైసెన్సుల విధింపు ప్రక్రియను మంగళవారం చేపట్టారు. ఆయా ప్రాంతాలలో ఖాళీ స్థలాలలో చెత్తా చెదారాలు ఉండడాన్ని గమనించి సిబ్బందిని మందలించారు. కాలువలు కూడా అపరిశుభ్రతగా ఉండడాన్ని గమనించి మరలా ఇటువంటివి పునరావృతం కాకుండా నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అలాగే ఆయా ప్రాంతాలలో ఉన్న పలు విద్యాసంస్థలు, కళాశాలల వద్దకు వెళ్లి ట్రేడ్ లైసెన్స్‌లను విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ వ్యాపార, వాణిజ్య సంస్థలు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. ఇప్పటికే కలిగి ఉన్న ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యువల్ చేయించుకోవాలని చెప్పారు. ఖాళీ స్థలాల యజమానులు తప్పనిసరిగా తమ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా చూడాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దెంకాడ: విద్యుత్‌లైన్ల విభజన కారణంగా మండలంలోని పలు గ్రామాలకు బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విజయనగరం ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు మంగళవారం తెలిపారు. మోపాడ, జగన్నాధపురం, వల్లూరు గ్రామాలతో పాటు మోదవలసలో సగ భాగం గ్రామాలకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నెల్లిమర్లలో...

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు విద్యుత్ శాఖ డీఈఈ పి.త్రినాధరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించడంతో పాటు సాంకేతిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మధుపాడ, పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, వల్లూరు, బుచ్చన్నపేట, బొడ్డపేట, ఒమ్మి, మల్యాడ, వెంకన్నపాలెం గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

24 నుంచి వేసవి శిక్షణా శిబిరం

విజయనగరం టౌన్: స్థానిక స్టేడియం రోడ్డులో ఉన్న ప్రభుత్వ మహారాజా ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 24 నుంచి జూన్ 2వ తేదీ వరకూ సృజనాత్మక వేసవి శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్టు బాల కేంద్రం సూపరింటెండెంట్ బుర్రా శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 ఏళ్ల నుంచి 16 ఏళ్ల వరకూ చిన్నారులకు శాస్త్రీయ గాత్ర సంగీతం, భక్తి సంగీతం, శాస్త్రీయ భరతనాట్యం, దేశభక్తి, జానపద నృత్యాలు ఉంటాయన్నారు. ప్రతీరోజూ సాయంత్రం 4.30 గంటల నుంచి 7.30 గంటల వరకూ శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 9441572195 నంబరును సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్సీ గాదెకు సత్కారం

విజయనగరం అర్బన్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికై ఇటీవల ప్రమాణ స్వీకరణ చేసిన డాక్టర్ గాదె శ్రీనివాసులునాయుడును పీఆర్‌టీయూ జిల్లా కమిటీ మంగళవారం స్థానిక మెసానిక్ టెంపుల్‌లో ఘనంగా సత్కరించింది. తొలిత పైడితల్లి అమ్మవారిని ఆలయంలో సందర్శించుకొని పట్టణంలో ర్యాలీగా సన్మాన సభకు వెళ్లారు. బాణా సంచా కాల్చుతూ ర్యాలీని మూడు లాంతర్ల జంక్షన్ నుంచి కోట, బాలాజీ కూడలి, ఆర్‌టీసీ కాంప్లెక్స్ మీదుగా మెసానిక్ టెంపుల్ వరకు కొనసాగింది. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎమ్మెల్సీను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉపాధ్యాయ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పీఆర్‌టీయూ నాయకులు వి.రవీంద్రనాయుడు, డి.శ్రీనివాస్, రావాడ రాంబాబు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు



స్వగృహ ప్రాంగణంలో పక్షుల సంరక్షణ ఏర్పాట్లు చేస్తున్న డాక్టర్ డీవీజీ శంకరావు

విజయనగరం అర్బన్: జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. మంగళవారం ఆయన నివాస ప్రాంతంలోని పర్యావరణ సంరక్షణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక నిర్మాణాలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో చాలా పక్షి జాతులు అంతరిస్తున్న పరిస్థితి ఏర్పడిందని వాటిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా పిచ్చుకలు అంతరించి పోయే పక్షి జాతుల్లో మొదటి వరుసలో ఉన్నాయని తెలిపారు. నగరీకరణ, పల్లెల్లో కూడా మారుతున్న జీవన శైలి, పర్యావరణం వల్ల అంతటా ఈ ప్రమాదం ముంచుకు వస్తోందని తెలిపారు. పక్షులు సంరక్షణకు ప్రధానంగా వేసవిలో వాటికి అవసరమైన వాతావరణ కల్పనకు విశాఖకు చెందిన గ్రీన్ క్లైమేట్ సంస్థ ప్రతినిధులు మట్టి పాత్రలను పంపిణీ చేశారని వారి ప్రయత్నాన్ని అభినందించారు. ఎవరికి వారే స్వచ్ఛందంగా వారి ఇళ్లలో పక్షుల సంరక్షణకు ముందుకు రావాలని తాము కూడా పక్షుల సంరక్షణ తమ ఇంట్లో మట్టి పాత్రను ఏర్పాటు చేసి అవి సేదదీరే ఏర్పాటు చేశామని తెలిపారు. జీవ వైవిధ్యం, జీవ సంరక్షణ పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని అన్నారు.

ఆక్రమణలను తొలగించండి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: అనుమతులు లేని నిర్మాణాలను, ఆక్రమిత కట్టడాలను గుర్తించి అటువంటి వాటిని తొలగించి వేయాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ప్రణాళిక సిబ్బందికి, కార్యదర్శులకు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర సుందరీకరణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందులో ప్రణాళిక కార్యదర్శులదే ప్రధాన భూమిక అని చెప్పారు. ప్రతి రోజు క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేసి ఆయా సచివాలయాల పరిధిలో ఫ్లెక్సీలు, పోస్టర్లు, గోడ రాతలు లేకుండా చూడాలన్నారు. అనుమతులు లేని కట్టడాలను, ఆక్రమిత నిర్మాణాలు లేకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. అక్రమ నిర్మాణాలను తొలగించే సమయంలో ప్రణాళికాబద్ధంగా చేపట్టాల్సిన చర్యలు గూర్చి వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, టీపీఓ అప్పలరాజు, టీపీఎస్ అనిత, ప్రణాళిక కార్యదర్శులు పాల్గొన్నారు.

నువ్వు సాగుతో రైతులకు మేలు



చందకపేటలో నువ్వు పంటను పరిశీలిస్తున్న ఏఓ నిర్మల

దెంకాడ: నువ్వు పంట సాగు చేసే రైతులకు ఆర్థికంగా మేలు ఉంటుందని ఏఓ పూడి నిర్మల అన్నారు. మండలంలోని చందకపేట గ్రామంలో నువ్వు పంటను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 320 ఎకరాల్లో నువ్వు పంట సాగు జరుగుతుందన్నారు. పంట కూడా ఆశాజనకంగా ఉందన్నారు. ఎకరా పొలంలో 3 కేజీల విత్తనాలు సరిపోతాయని వివరించారు. వర్షాధారంగా పంట సాగు చేసినా మంచి దిగుబడి ఉంటుందన్నారు. తక్కువ నీటితో, తక్కువ రసాయనాలతో, తక్కువ పెట్టుబడితో నువ్వు పంటను సాగు చేయవచ్చన్నారు. నువ్వులో నూనె శాతం ఎక్కువగా ఉండటం వలన మంచి ధర కూడా ఉంటుందని తెలిపారు. నువ్వులతో నూనె, కాకుండా అనేక ఆహార ఉత్పత్తుల్లో వినియోగిస్తారని చెప్పారు. నువ్వులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. అందువలన రైతులు నువ్వు పంట సాగును మరింత విస్తారించాలన్నారు.

ఆరు మాసాలు దాటిన వారికి రక్తహీనత పరీక్షలు



రక్తహీనత పరీక్షలు పరిశీలిస్తున్న డీఐఓ

దెంకాడ: ఆరు మాసాలు దాటిన వారందరికీ రక్తహీనత పరీక్షలు చేయనున్నట్టు డీఐఓ డాక్టర్ అచ్చుతకుమారి అన్నారు. మండలంలోని రఘుమండ గ్రామంలో అంటెన్సిఫైడ్ అనిమియా ఫ్రీ విలేజ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా రఘుమండలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు రక్తహీనత పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీన్ని డీఐఓ అచ్చుతకుమారి పరిశీలించి మాట్లాడారు. రక్తహీనతతో బాధపడుతున్న వారందరికీ మూడు నెలల పాటు ఐరన్ మాత్రలు ఇవ్వడం జరుగుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సత్యనారాయణ, సూరిబాబు, రాజేశ్వరి, సుభద్ర, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి చర్యలు



ప్రహరీ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

విజయనగరం: గుణుపూరు పేట డంపింగ్ యార్డ్ ప్రాంతంలో తూర్పు వైపు ప్రహరీ నిర్మించేందుకు అవసరమైన అన్ని చర్యలను చేపట్టనున్నట్టు కార్పొరేషన్ డీఈఈ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి మంగళవారం డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ తూర్పు వైపు ప్రహరీ నిర్మించనున్న నేపథ్యంలో పనులు ప్రారంభించేందుకు అవసరమైన సూచనలు, సలహాలను సిబ్బందికి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు 39 లక్షల రూపాయలతో డంపింగ్ యార్డ్ తూర్పు వైపు ప్రహరీ నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మొత్తం 390 మీటర్ల నిడివి గల ప్రహరీ నిర్మాణానికై కౌన్సిల్ తీర్మానించిందన్నారు. దీంతో పనులు ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నామని ఆయన తెలిపారు.

డ్రోన్స్‌తో బహిరంగ మద్యపానానికి చెక్

- వన్‌టౌన్‌లో 12, టూటౌన్‌లో 9 కేసులు నమోదు



నగర శివారు ప్రాంతాలైన వైఎస్సార్ నగర్, బాబామెట్టలలో డ్రోన్ల సహాయంతో మందుబాబులను పట్టుకున్న పోలీసులు

విజయనగరం క్రైమ్: బహిరంగంగా మద్యం తాగడం నేరమని పోలీసులు చెబుతున్నా మందుబాబులు పెడచెవిన పెడుతున్నారు. ఇక లాభం లేదని డ్రోన్స్ సహాయంతో మందుబాబుల ఆట కట్టించారు. డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశాలతో వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, టూటౌన్ సీఐ శ్రీనివాస్‌లు నగర శివారు ప్రాంతాలలో మద్యం తాగుతున్న 21 మందిని మంగళవారం పట్టుకున్నారు. వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన కచ్చితమైన సమాచారంతో ఉడా కాలనీ, దుప్పాడ, గాజులరేగ, వైఎస్సార్ నగర్, బాబామెట్ట, నారాయణపురం ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం తాగుతున్న వారిని ప్రత్యేకంగా డ్రోన్స్‌ను ఉపయోగించి గుర్తించారు. ఈ మేరకు వన్‌టౌన్ పీఎస్ పరిధిలో 12 కేసులు, టూటౌన్ పీఎస్ పరిధిలో 9 కేసులు నమోదు చేశారు.

బీట్‌కు రారు.. నీళ్లు పోయరు..!

- కొత్తపేటలోని ఫారెస్ట్‌లో ఎండిపోతున్న మొక్కలు



కొత్తపేట ఫారెస్ట్ ఏరియాలో ఎండిపోయిన మొక్కలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేట సమీపంలో ఉన్న ధమరసింగి ఫారెస్ట్ బీట్ నిరాదరణకు గురవుతుంది. అడవుల విస్తీర్ణాన్ని పెంచాలనే లక్ష్యంతో సుమారు 20.36 హెక్టార్ల పరిధిలో 20,360 మొక్కలను నాటామని అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా వేప, నేరేడు, తెల్లమద్ది, పనస, చింత, రావి, మర్రి, ఉసిరి, టేకు, తదితర విలువైన మొక్కలను నాటారు. వాటిలో కొన్ని మొక్కలను నాటకుండానే బీట్ సమీపంలో విడిచి పెట్టారు. ఆ మొక్కలకు నీరు అందకపోవడంతో దాదాపు ఎండిపోయాయి. సంబంధిత అధికారులు బీట్ వద్ద విధులు నిర్వర్తించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో పశువులు లోపలికి ప్రవేశించి నాటిన మొక్కలను మేస్తుండడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని చెబుతున్నారు. అలాగే సతివాడ-ఎంబేరేయగుళ్ల పరిధిలో కూడా బీట్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఉన్న కొద్దిపాటి చెట్లు కూడా అన్యాక్రాంతమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి మొక్కలకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.